

మండే ఎండల్లోనూ జలకళ

సాగునీరు వనరుల అభివృద్ధితో జిల్లాలో మండే ఎండల్లోనూ జలకళ ఉట్టి పడుతోంది. అలాగే, సాగు సాఫీగా సాగుతోంది.

8లో



మహిళా టీ-20 విజేత మహారాష్ట్ర

ఖమ్మం పటేల్ స్టేడియంలో జరుగుతున్న మహిళా టీ-20 క్రికెట్ టోర్నీలో మహారాష్ట్ర జట్టు విజేతగా నిలిచింది.

8లో

గరిష్టం / కనిష్టం

43° / 29°

వాతావరణం

జిల్లాలో బుధవారం కూడా గరిష్టస్థాయిలోనే ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

టీఎన్జీవోస్ హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్‌గా చంద్రశేఖర్



చంద్రశేఖర్‌కు నియామక పత్రం అందజేస్తున్న అఫ్జల్, సాగర్

ఖమ్మంసహకారనగర్: జిల్లా టీఎన్జీవోస్‌లో కొత్తగా ఏర్పడిన హౌసింగ్ సొసైటీ చైర్మన్‌గా నియమితులైన నీరుకొండ చంద్రశేఖర్‌కు మంగళవారం యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ అఫ్జల్ హసన్, ఆర్.వీ.ఎస్.సాగర్ నియామకపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అఫ్జల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల కోసం 2005లో అప్పటి ప్రభుత్వం 103 ఎకరాల భూమి కేటాయించగా, సభ్యత్వం కలిగిన 1,686 మందికి ప్లాట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇంకా మిగిలిన ప్లాట్లను జీఓ 244 ప్రకారం మరో కొత్త సొసైటీ ద్వారా పంపిణీ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో ది న్యూ ఖమ్మం జిల్లా కోపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీని ఏర్పాటుచేసి చైర్మన్, ప్రమోటర్‌గా నీరుకొండ చంద్రశేఖర్‌ను నియమించినట్లు వివరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు నందగిరి శ్రీను, రాష్ట్ర కార్యదర్శి జీ.ఎస్.ప్రసాద్‌రావుతో పాటు సుంచు వీరనారాయణ, ఎం.డీ.మజీద్, నాగుల్ మీరా, కట్టా నవీన్, భాగం పవన్, బుద్దా రామకృష్ణ, వై.శ్రీనివాసరావు, ఫిరంగి శ్రీను పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం వృద్ధి



పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్న డీఏఓ విజయనిర్మల

తిరుమలాయపాలెం: పచ్చిరొట్ట పంటలైన జనుము, పెసర, జీలుగతో నిస్సారమైన భూముల్లో సారం పెరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల తెలిపారు. తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. పచ్చిరొట్ట విత్తనాలు నాటి పూత దశలో దున్నడం ద్వారా నేలకు కర్బనం, నత్రజని, భాస్వరం, పొటాష్ పోషకాలు అందడమే కాక సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది భూమి గుల్లబారి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం 66శాతం సబ్సిడీపై ఇచ్చే పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కూసుమంచి ఏడీఏ విజయచంద్ర, ఎంపీపీ మంగీలాల్, ఎంపీడీఓ జయరాం, ఏఓ నారెడ్డి సీతారాంరెడ్డి, సొసైటీ సీఈఓ శ్రీనివాసరెడ్డి, ఎస్సై వరాల శ్రీనివాస్, ఏపీఓ నర్సింహారావు, ఉండేటి దాసయ్యతో పాటు ఏఈఓలు పాల్గొన్నారు.

అటు కాంగ్రెస్.. ఇటు బీజేపీ!







ఉమ్మడి ఖమ్మంపై జాతీయ పార్టీల ఫోకస్

- 15న జిల్లాకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా
- లక్ష మందితో బహిరంగ సభకు ఏర్పాట్లు
- ఈనెల 25న ఖమ్మం చేరుకోనున్న భట్టి పాదయాత్ర
- ముగింపు సభకు హాజరుకానున్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాపై జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ప్రత్యేక దృష్టి సారించాయి. వచ్చే ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఏ అవకాశాన్నీ వదులుకోకుండా జిల్లాలో వరుస కార్యక్రమాల నిర్వహణకు రెండు పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. బీజేపీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 15న ఇక్కడ నిర్వహించే బహిరంగ సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొననున్నారు. ఇప్పటికే ఆయన పర్యటన ఖరారు కాగా.. మరోవైపు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ యాత్ర ఈనెల 25న ఖమ్మంలో ముగియనుంది. ఈ సందర్భంగా ఖమ్మంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరవుతారని చెబుతున్నారు. రోజుల తేడాలోనే రెండు పార్టీల జాతీయ నేతలు జిల్లాకు రానుండడంతో రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

బీజేపీ.. మహాజన సంపర్క్ అభియాన్

బీజేపీ జాతీయ నాయకత్వం ఉమ్మడి ఖమ్మం జిల్లాపై నజర్ పెట్టింది. అర్బన్ ప్రాంతాల్లోనే బీజేపీ బలంగా ఉందని.. ప్రధానంగా ఖమ్మం జిల్లాలో పార్టీ బలహీనంగా ఉందని ఇటీవల జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలనే ఉద్దేశంతో ఖమ్మం కేంద్రంగా కార్యకలాపాలను విస్తృతం చేస్తోంది. గత నెల 27న ఖమ్మంలో నిర్వహించిన నిరుద్యోగ మార్చ్‌లో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. గత మూడు నెలల క్రితం కూడా బండి సంజయ్ జిల్లాకు వచ్చారు. ఇక ఈనెల 15న ఖమ్మంలో జరిగే మహాజన్ సంపర్క్ అభియాన్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాల్గొంటారని బండి సంజయ్.. జిల్లా బీజేపీ అధ్యక్షుడు గల్లా సత్యనారాయణకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా దాదాపు లక్ష మందితో సర్దార్ పటేల్ స్టేడియంలో భారీ సభ నిర్వహించాలని నిర్ణయించగా, ఈనెల 9న సంజయ్ ఖమ్మం వచ్చి ఏర్పాట్లపై సూచనలు చేయనున్నారు. కాగా, అమిత్‌షా వెంట కేంద్రమంత్రులు బీఎల్.వర్మ, కిషన్‌రెడ్డితోపాటు మరికొందరు మంత్రులు, అలాగే జాతీయ నేతలు హాజరవుతారని తెలిసింది. ఖమ్మంలో అమిత్‌షా పాల్గొనే సభను విజయవంతం చేయడం ద్వారా పార్టీ సత్తా చాటాలనే యోచనలో పార్టీ నాయకత్వం ఉంది.

కాంగ్రెస్ 'మార్చ్'

సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క మార్చి 16న ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం ఇచ్చోడ మండలం పిప్రి నుంచి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేపట్టారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, హన్మకొండ, జనగామ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ మీదుగా సాగుతున్న ఆయన పాదయాత్ర మంగళవారం 82వ రోజుకు చేరింది. ఆపై నల్లగొండ, సూర్యాపేట జిల్లాల మీదుగా ఈనెల 25న ఖమ్మంకు చేరుకోనున్నారు. ఆరోజుతో పాదయాత్ర 101రోజులు పూర్తవుతుంది. జిల్లాలో యాత్ర అనంతరం ముగింపు సందర్భంగా ఖమ్మంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. రెండు లక్షల మందిని సమీకరించాలని టీపీసీసీ నిర్ణయించింది. సభకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని ఆహ్వానించాలని పార్టీ నేతలు యోచిస్తుండగా, ఆయనతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రానున్నారు.

రాజుకున్న రాజకీయ వేడి

జూన్ నెలలో జిల్లాలో రాజకీయ వేడి రాజుకుంది. అన్ని పార్టీలకు ఈనెల కీలకంగా మారగా.. వరుస కార్యక్రమాలపై దృష్టి సారించాయి. ఒకే నెలలో రెండు జాతీయ పార్టీల ప్రముఖ నాయకులు ఖమ్మం రానుండటం.. సభలను విజయవంతం చేసి సత్తా చాటాలని ఇరు పార్టీలు ఇప్పటి నుంచే సర్వశక్తులొడ్డుతున్నాయి. మరోవైపు ఈ నెలలోనే మరికొన్ని కీలక పరిణామాలు చోటు చేసుకుంటాయనే ఊహాగానాలు వస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో బలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రెండు ఎన్నికల్లోనూ సత్తా చాటింది. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అధిక సీట్లు గెలవాలనే లక్ష్యంతో కార్యక్రమాలకు రూపకల్పన చేస్తోంది. ఇప్పటికే పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి జిల్లాలో పర్యటించగా.. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ ముగింపు సభను భారీ ఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మరోవైపు బీజేపీ కూడా జిల్లాలో పుంజుకునేందుకు తన ప్రయత్నాలు ముమ్మరం చేసింది. కేంద్ర నాయకత్వం ప్రత్యేక చొరవతో ఖమ్మంలో కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇక బీఆర్ఎస్ కూడా ఖమ్మంకు ప్రాధాన్యత ఇస్తోంది. జనవరి 18న బీఆర్ఎస్ ఆవిర్భావ సభ నిర్వహించడంతోపాటు పలు కార్యక్రమాల నిర్వహణకు ఖమ్మంను ఎంచుకుంది. మొత్తం మీద ఖమ్మం అన్ని పార్టీలకు కేంద్రంగా మారుతోంది.

వేగంగా పారిశ్రామిక ప్రగతి





మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్, పక్కన కలెక్టర్ గౌతమ్, మేయర్ నీరజ, ఎమ్మెల్సీ మధు, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజు తదితరులు (ఇన్‌సెట్) సెక్యూరిటీ గదిని ప్రారంభించిన మంత్రి, కలెక్టర్ తదితరులు

- హైదరాబాద్ స్థాయిలో ఖమ్మం ఐటీ కారిడార్
- పారిశ్రామిక ప్రగతి సభలో మంత్రి పువ్వాడ

ఖమ్మంఅర్బన్: తెలంగాణ ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చొరవతో పారిశ్రామిక అభివృద్ధి వేగంగా సాగుతోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఖమ్మం ఐటీ హబ్‌లో జరిగిన తెలంగాణ పారిశ్రామిక ప్రగతి సభలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు తెలంగాణ పరిశ్రమలకు నీళ్లు, కరెంట్ లేక మూసేసేవారని.. కానీ ఇప్పుడు ప్రభుత్వ విధానాలతో సామాన్యులు సైతం పరిశ్రమలను విజయవంతంగా నడిపిస్తున్నారని తెలిపారు. పరిశ్రమలకు సులభంగా అనుమతులు ఇస్తుండడమే కాక నిరంతర విద్యుత్ అందిస్తున్నామని, బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు ఇప్పిస్తున్నామని చెప్పారు. జిల్లాలో గ్రానైట్ పరిశ్రమను కడుపులో పెట్టుకుని కాపాడుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు కూడా మెరుగవుతున్నాయని వివరించారు. కాగా, హైదరాబాద్ స్థాయిలో ఖమ్మంలో నెలకొల్పిన ఐటీ టవర్ ద్వారా ఇప్పటికే వెయ్యి మందికి ఉద్యోగావకాశాలు దక్కాయని, రెండో దశ పనులకు రూ.35కోట్లు మంజూరు కాగా ఇంకో రెండు వేల మందికి ఉపాధి లభిస్తుందని మంత్రి తెలిపారు. అనంతరం జిల్లాకు చెందిన పలువురు పారిశ్రామిక వేత్తలను సత్కరించారు. అలాగే, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, జెడ్పీ చైర్మన్లు కొండబాల కోటేశ్వరరావు, లింగాల కమల్‌రాజ్, మేయర్ పునుకొల్లు నీరజ, పారిశ్రామిక వేత్తలు ప్రకాష్, ఉప్పల వెంకటరమణ, చిన్ని కృష్ణారావు మాట్లాడారు. ఈ సభలో మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం అజయ్‌కుమార్, మైనింగ్ ఏడీ సంజయికుమార్, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావుతో పాటు ఫాతిమా జోహరా, పారా నాగేశ్వరరావు, బొమ్మ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత మంత్రి క్యాంప్ కార్యాలయం నుండి ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా ఐటీ హబ్‌కు చేరుకున్నారు.

సోలార్ ప్లాంట్, షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన

ఖమ్మంసహకారనగర్: కలెక్టరేట్‌లో రూ.1.78 కోట్ల వ్యయంతో ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన సోలార్ ప్లేట్లతో కూడిన పార్కింగ్ షెడ్ నిర్మాణానికి రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. అలాగే, కలెక్టరేట్ ముఖద్వారం నిర్మించిన సెక్యూరిటీ గదిని ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యం కోసమే కొత్త జిల్లాలు ఏర్పాటుచేసిన ప్రభుత్వం.. అన్ని శాఖల ఒకేచోటుండేలా కలెక్టరేట్లను నిర్మించిందని తెలిపారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ సోలార్ రూఫ్‌తో పార్కింగ్ షెడ్‌తో విద్యుత్ ఉత్పత్తి చేయడమే కాక వాహనాలకు భద్రత లభిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధు, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, జెడ్పీ, సుడా చైర్మన్లు లింగాల కమల్‌రాజ్, విజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ స్నేహలత, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ రాధి కాగుప్తా, వీ.వీ.పాలెం సర్పంచ్ రావెళ్ల మాధవి తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమంటున్న ఎండలు



ఖమ్మంవ్యవసాయం: ఎండలు భగ్గుమంటున్నాయి. రోహిణి కార్తె ముగింపు దశకు వచ్చినా ఉష్ణోగ్రతలు ఏ మాత్రం తగ్గడం లేదు. వాతావరణ శాఖ అధికారులు మాత్రం రానున్న మూడు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని చెబుతున్నా ఆ పరిస్థితి కనిపించడం లేదు. దాదాపు నెల రోజులుగా కొనసాగుతున్న ఎండల తీవ్రత మంగళవారం కూడా కొనసాగింది. ఉదయం 8 గంటలకే మొదలవుతున్న ఎండ పది గంటలకల్లా పతాక స్థాయికి చేరుతుండడంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఇక బస్సులు, ఆటోలు, రైళ్లలో ప్రయాణించే వారు ఎండ తీవ్రత, వడ గాలికి ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం జిల్లాలో అత్యధికంగా మధిరలో 44.3 డిగ్రీలతో పాటు ముదిగొండ మండలం పమ్మిలో 44.2, ఖమ్మం అర్బన్ ఖానాపురంలో 44.1, సత్తుపల్లి, మధిర మండలం సిరిపురం, ఎర్రుపాలెంలో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇకనేలకొండపల్లి, బాణాపురం, చింతకానిలో 43.9, పెనుబల్లి, ముదిగొండ, పల్లెగూడెంలో 43.8, కల్లూరులో 43.5, గంగారంలో 43.2, సదాశివునిపేటలో 42.9, వేంసూరు, ప్రకాష్‌నగర్‌లో 42.6, బచ్చోడులో 42.6, గేటు కారేపల్లిలో 42.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, బోనకల్ మండలం రావినూతలలో 38.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని అధికారులు వెల్లడించారు.

సీ–శాట్ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన హైదరాబాద్‌లో ఇచ్చే యూపీఎస్సీ సీ–శాట్ శిక్షణకు నిరుద్యోగ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. జిల్లాలోనీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, పీహెచ్‌సీ నిరుద్యోగ అభ్యర్థులు డిగ్రీ, ప్రొఫెషనల్ డిగ్రీలో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు జూలై 7లోగా టీఎస్ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, అదే నెల 9న పరీక్ష నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం 98484 94290 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలు వుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశా రు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్ పేరిట అసత్య ప్రచారం..

ఖమ్మంసహకారనగర్: సోషల్ మీడియాలో జిల్లా కాంగ్రెస్ పేరిట వస్తున్న వార్తలు, జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. కొందరు వ్యక్తులు ఖమ్మం డీసీసీ పేరుతో తెరిచిన ఫేస్‌బుక్ ఖాతాతో పార్టీకి సంబంధం లేదని పేర్కొన్నారు. ఈ ఖాతా చేస్తున్న పోస్టులను నమ్మొద్దని, పార్టీ శ్రేణులు ఇతర గ్రూపులకు పంపొద్దని ఆయన సూచించారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ గ్రూప్‌ల్లో నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుల, చేతి వృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం

ఖమ్మంమయూరిసెంటర్: వెనుకబడిన వర్గాలకు చెందిన అన్ని కుల, చేతి వృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు అర్హుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి తెలిపారు. బీసీ–ఏ, బీ, డీ వర్గాల వారు ఆర్థిక సాయం కోసం కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫొటో, బ్యాంకు అకౌంట్ వివరాలతో tsobmmsbc.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. జూన్ 2023 నాటికి 18 ఏళ్లు నిండి 55 ఏళ్ల లోపు వారు, వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల వారైతే రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల వరకు ఉంటే అర్హులని తెలిపారు. గత ఐదేళ్లలో ఏ ప్రభుత్వ శాఖ ద్వారానైనా ఆర్థిక లబ్ధి పొందిన వారు, 2017–18లో రూ.50 వేలు లబ్ధి పొందిన వారు అర్హులు కాదని చెప్పారు. ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తుకు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫొటో, బ్యాంక్ అకౌంట్ వివరాలు జతపరిచి మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో అందజేయాలని ఆమె సూచించారు.

క్లుప్తంగా

ఎన్ఐఆర్ఎఫ్‌లో ఎస్సార్‌కు 98వ ర్యాంక్



వరదారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న వీసీ దీపక్‌గార్గ్

హసన్‌పర్తి: కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్) ర్యాంకుల్లో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని ఎస్సార్ యూనివర్సిటీకి ఇంజనీరింగ్ విభాగంలో 98వ స్థానం దక్కింది. యూనివర్సిటీలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు. యూనివర్సిటీ విభాగంలో 101–150 ర్యాంక్ బ్యాండ్‌లో నిలవగా, తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్లలో ఎస్సార్ ప్రథమ స్థానంలో నిలిచిందని వివరించారు. యూనివర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి, పరిశోధనలు, పారిశ్రామిక భాగస్వామ్యం, జాతీయ, అంతర్జాతీయ ఒప్పందాలు, నాణ్యమైన, విద్య ర్యాంక్ రావడానికి కొలమానంగా చెప్పారు. ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ దీపక్‌గార్గ్ మాట్లాడుతూ నూతన సాంకేతికతలో తమ యూనివర్సిటీ ముందు వరుసలో ఉందని తెలిపారు.

నేడు జిల్లాలో ఎంపీ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఖమ్మం, పాలేరు, వైరా నియోజకవర్గాల్లో జరగనున్న సాగునీటి దినోత్సవ కార్యక్రమాల్లో ఎంపీ పాల్గొంటారు. అతర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ పర్యటించిన పలువురి కుటుంబాలను పరామర్శించనున్నారు.

పాడి పరిశ్రమతో రైతులకు లాభాలు

పెనుబల్లి : రైతులకు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను ఎంచుకుంటే లాభదాయకంగా ఉంటుందని ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. ఈ యూనియన్ పరిధి పెనుబల్లి మండలం కోంద్రుపాడు కేంద్రాన్ని మంగళవారం సందర్శించిన ఆయన రైతులకు అవగాహన కల్పించారు. రైతుల ఆలోచనలకు అనుగుణంగా తాము గిట్టుబాటు ధర చెల్లిస్తున్నామని, పిల్లల కల్యాణం, చదువుల విషయంలో అండగా నిలుస్తున్నామని తెలిపారు. సంఘాల అధ్యక్షులు ఎర్రా రామారావు, మందడపు అశోక్ కుమార్, సెంటర్ మేనేజర్ టి.సాంబశివమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు



వేదికపై చిన్నారుల నృత్య ప్రదర్శన

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా లకారం ట్యాంక్‌బండ్‌పై జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. ఈమేరకు మంగళవారం సాయంత్రం చిన్నారుల నృత్య ప్రదర్శనలు, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల ఆటపాటలు, ఇందు కూచిపూడి నృత్యం, మస్తాన్ స్ట్రీట్ మ్యాజిక్, మహిమ్, వీరేందర్‌ల నృత్యాలను స్థానికులు పెద్దసంఖ్యలో హాజరై తిలకించారు. కాగా, ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్, స్టాళ్ల వద్ద సందడి నెలకొనగా, జిల్లా పర్యాటక అధికారి సుమన్, మత్స్యశాఖ ఏడీ ఆంజనేయస్వామి, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ బిల్ కలెక్టర్ల సదస్సు

ఖమ్మంవ్యవసాయం: దీర్ఘకాలంగా విద్యుత్ శాఖలో పనిచేస్తున్న మీటర్ రీడర్లు, బిల్ కలెక్టర్ల సమస్యలపై చర్చించేందుకు హైదరాబాద్‌లో గురువారం సమావేశం ఏర్పాటుచేసినట్లు టీఎస్ యూఈఈయూ(సీఐటీయూ) కంపెనీ కార్యదర్శి ఎం.ప్రసాద్ తెలిపారు. కనీస వేతనాల అమలు, ఈపీఎఫ్, ఈఎస్ఐపై ఈ సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి మీటర్ రీడర్లు, బిల్ కలెక్టర్లు హాజరుకావాలని కోరారు.

అక్రమంగా మట్టి తవ్వకం

మధిర: మండలంలోని దెందుకూరు సమీపంలో చెరువు నుంచి కొందరు అనుమతి లేకుండా మట్టి తవ్వి తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా లోతైన గుంతలు తీస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశముందని స్థానికులు వాపోతున్నారు. వీరిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,700	1,400
పెసలు	7,250	6,200
మిర్చి	20,500	12,500
ఏ/సీ మిర్చి	24,450	18,500
మిర్చి తాలు	13,000	8,000
పత్తి	7,100	6,000

– ఖమ్మం వ్యవసాయం

మండే ఎండల్లోనూ జలకళ



ఖమ్మం ప్రకాష్‌నగర్ వద్ద మున్నేరుపై నిర్మించిన చెక్‌డ్యాం

- 'మిషన్ కాకతీయ'తో పెరిగిన భూగర్భ జలాలు
- పాలేరు పాత కాల్వ అభివృద్ధితో సాఫీగా సరఫరా
- సాగునీటి శాఖలన్నీ ఒకే గొడుకు కిందకు...
- నేడు 'సాగునీటి దినోత్సవం'



ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దిన లకారం చెరువు

ఖమ్మంఅర్బన్: తెలంగాణ ఏర్పడ్డాక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది.కాకతీయుల కాలం నాటి చెరువులకు పూర్వవైభవం తీసుకొచ్చేలా నాలుగు దశల్లో చేపట్టిన మిషన్ కాకతీయ పథకం కింద పూడికతీతలు, కంపచెట్ల తొలగింపు, తూములు, అలుగులు మరమ్మతులు, పంట కాల్వల పనులు చేపట్టారు. దీంతో చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరగడమే కాక కాల్వలను బాగు చేయడంతో జిల్లాలో భూగర్భజలాలు అభివృద్ధి చెందాయి. ఫలితంగా సాగుకు ఢోకా లేకపోగా, భగభగమండే వేసవిలో సైతం జిల్లావ్యాప్తంగా అనేక చెరువుల్లో జలకళ ఉట్టిపడుతోంది. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాగునీటి దినోత్సవం నిర్వహించనున్న నేపథ్యాన కథనం.

రూ.207కోట్లతో అభివృద్ధి

గడిచిన పదేళ్లలో జిల్లావ్యాప్తంగా 1,429 చెరువులను సుమారు రూ.207కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు. తద్వారా 1.05టీఎంసీల నీటి సామర్థ్యం పెరగగా స్థిరీకరించిన ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందుతోందని జల వనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే, ప్రతీ నియోజకవర్గంలో కనీసం ఒక్కో చెరువు చొప్పున మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దడంలో భాగంగా జిల్లాలోని ఆరు చెరువులను రూ.36కోట్ల వ్యయంతో తీర్చిదిద్దారు. ఇంకా రెండు చెరువులు పనులు సాగుతున్నాయి. జిల్లాకేంద్రం నడిబొడ్డున ఉన్న లకారం ట్యాంక్ బండ్ అభివృద్ధి ద్వారా పర్యాటక ప్రాంతంగా రూపుదాల్చింది. ఇక పాలేరు వద్ద భక్త రామదాసు ఎత్తిపోతల పథకాన్ని రూ.336కోట్లతో చేపట్టి 75,323 ఎకరాల ఆయకట్టుకు నీరు అందిస్తున్నారు. దీని ద్వారా 186 చెరువులకు నీటి సరఫరా జరుగుతోంది. ఇక రూ.70 కోట్ల వ్యయంతో పాలేరు పాత కాల్వను ఆధునికీకరించడంతో నీరు వృథా కాకుండా కాల్వ పరిధిలోని ఆయకట్టుకు పుష్కలంగా నీరు అందుతోంది.

చెక్‌డ్యాంల నీరు వృథా కాకుండా..

వాగులు, వంకలు, ఏర్లు, నదుల నుంచి నీరు సముద్రం పాలయ్యేది. కానీ నీటిని ఎక్కడికక్కడ ఒడిసిపట్టేలా చెక్‌డ్యాంలు నిర్మించడంతో భూగర్భజలాలు పెరగడమే కాక సాగు నీటి అవసరాలకు ఉపయోగపడుతున్నాయి. చెక్ డ్యాంలు, చెరువుల పునురుద్ధరణతో ఒకప్పుడు వేసవి వస్తే తాగునీటి కోసం అల్లాడిన ప్రజలకు ఇబ్బందులు తీరాయి. మొదటి దశలో రూ.85కోట్ల వ్యయంతో 23 చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టగా 18 పూర్తయ్యాయి. మళ్లీ మరో 40చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.238కోట్లతో ప్రతిపాదించారు.

సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా...

సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాలో నాలుగు ప్యాకేజీలుగా రూ.1720.89కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ పనులు పూర్తయితే 1.45 లక్షల ఎకరాలకు నీరు అందనుంది. అంతేకాక జిల్లాలోని మేజర్, మీడియం, మైనర్ స్కీంల ద్వారా స్థిరీకరించిన 2.95 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఆయా పథకాల్లో నీరు లేనప్పుడు ఎత్తిపోయడం సాధ్యమవుతుంది.

ఒకే గొడుకు కిందకు శాఖలు

నీటి పారుదల శాఖ పునర్వ్యవస్థీకరణలో భాగంగా శాఖలన్నింటినీ ఒకే గొడుకు కిందకు తీసుకొచ్చారు. గతంలో ఎన్నెస్పీ, ఇరిగేషన్, లిఫ్ట్ ఇరిగేషన్, మేజర్, మైనర్ ఇరిగేషన్ శాఖలు ఉండగా అన్నింటినీ కలిపి జల వనరుల శాఖగా ఏర్పాటు చేశారు. అలాగే, ఎకరాలు వారీగా ఇంజనీర్లను కేటాయించడంతో పర్యవేక్షణ సులువైంది. జిల్లాలో ఒక సీఈ, ఇద్దరు ఎస్ఈలే కాక ఆరు డివిజన్లు, 23 సబ్ డివిజన్లలో ఇంజనీర్లు విధులు నిర్వర్తిస్తున్నారు.

నేడు ఐదు ప్రాంతాల్లో వేడుకలు

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా బుధవారం సాగునీటి దినోత్సవం నిర్వహించనున్నారు. ఈమేరకు జిల్లాలో పాలేరు నియోజకవర్గానికి సంబంధించి నేలకొండపల్లి మార్కెట్‌లో, ఖమ్మం నియోజకవర్గంలో ప్రకాశ్‌నగర్ చెక్‌డ్యాం, వైరా నియోజకవర్గంలో అక్కడి రిజర్వాయర్, సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరులోని ఎస్ఈ కార్యాలయం, మధిర నియోజకవర్గ కేంద్రమైన రైతు వేదికలు వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

పాఠశాల ప్రారంభానికల్లా పనులన్నీ పూర్తి

'మన ఊరు – మన బడి'పై సమీక్షలో కలెక్టర్ గౌతమ్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ మధుసూదన్, అధికారులు

ఖమ్మంసహకారనగర్: పాఠశాలల తెరిచే నాటికల్లా మన ఊరు – మన బడి, మన బస్తీ– మన బడి కింద చేపట్టిన పనులన్నీ పూర్తి చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. జిల్లాలో మొదటి విడతగా 426 పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన విద్యాశాఖ, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీన్ చాక్ బోర్డులు, డ్యూయల్ డెస్కులు, అదనపు గదులు, పెయింటింగ్ పనుల్లో వేగం పెంచాలని సూచించారు.

మొక్కజొన్న సేకరణ పూర్తి చేయాలి

జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్లలో పెంచి త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. అధికారులు, మిల్లర్లు, రవాణా సంస్థల ప్రతినిధులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 9,167 మంది రైతుల నుండి రూ.107.65 కోట్ల విలువైన 54,868.753 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ మొక్కలను వెంటనే గోదాంలకు తరలించేలా లారీలు, హమాలీలను సమకూర్చుకోవాలని చెప్పారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎస్.మధుసూదన్, అసిస్టెంట్ కలెక్టర్లు రాధికాగుప్తా, మయాంక్ సింగ్, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, డీఈఓ సోమశేఖరశర్మ, డీసీఓ విజయకుమారి, మార్క్‌ఫెడ్ డీఎం సునీత, ఇతర శాఖల అధికారులు కే.వీ.కే.శ్రీనివాస్, చంద్రమౌళి, నాగశేషు, తానాజీ, శ్యాంప్రసాద్, హేమలత, కృష్ణలాల్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలను తరలించాలని వినతి

బోనకల్: మార్క్‌ఫైడ్ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్నలను వెంటనే తరలించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరావు, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల్ల వెంకటేశ్వరావు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పలువురు రైతులతో కలిసి కలెక్టర్ గౌతమ్‌ను కలిసిన వారు బోనకల్ మండలంలో తొమ్మిది సంఘాల్లో కొనుగోలు చేసిన మొక్కజొన్నలను తరలించకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తమ్మారపు బ్రహ్మయ్య, దొడ్డ నాగేశ్వరావు, షేక్ ఉస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు హేమంతరావు



నేరడలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న హేమంతరావు

చింతకాని: కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు కోరారు. కొత్తగూడెంలో ఈ నెల 11న సీపీఐ ఆధ్వర్యాన జరగనున్న ప్రజాగర్జనను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని నేరడ, కోమట్లగూడెం, నాగిలిగొండ, ప్రొద్దుటూరు, రాఘవాపురం, వందనం గ్రామాల్లో మంగళవారం ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ దేశ ప్రజలను దగా చేస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపి, ప్రమాదంలో పడిపోతున్న దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజల్లో మోదీ ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతకు కర్ణాటక ఎన్నికల ఫలితాలే నిదర్శమని తెలిపారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయాలని, పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్‌రావు, దూసరి గోపాల్‌రావు, అబ్బూరి మహేశ్, పదిమెల వెంకటనర్సయ్య, సింగారపు సత్యనారాయణ, షేక్ దస్తగిరి, గోగుల ఆది, రెడ్డిబోయిన శ్రీను, అమర్లపూడి వెంకన్న, బక్కిరెడ్డి జానకీరాములు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు పంపిణీ చేశారని ఆందోళన

వైరా/వైరారూరల్: వైరా సొసైటీ ద్వారా పంపిణీ చేసిన జీలుగు విత్తనాలు నాసిరకంగా ఉన్నాయని ఆరోపిస్తూ మండలంలోని సోమవరం గ్రామానికి చెందిన రైతులు మంగళవారం సొసైటీ గోదాం వద్ద ఆందోళనకు దిగారు. గ్రామానికి 72 మంది రైతులు 310 బస్తాల జీలుగు విత్తనాలను వైరాలోని సొసైటీ గోదాం నుండి తీసుకెళ్లారు. అయితే, విత్తనాల్లో నల్లగింజలు, పుచ్చు గింజలు ఉండడంతో మంగళవారం గోదాంల వద్దకు వచ్చి ఆందోళన చేపట్టారు. ఈ విత్తనాలను పొలంలో చల్లితే మొక్కల ఎదుగుల లేక నష్టం ఎదురవుతుందని, ఈ ఖర్చు ఎవరు భరించాలని అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ సొసైటీ కేంద్రాల ద్వారా నాసిరకం విత్తనాలు ఇవ్వడంపై మండిపడ్డారు. దీంతో సోమవరం గ్రామానికి వెళ్లిన ఏఓ ఎస్.పవన్‌కుమార్ విత్తనాలను పరిశీలించారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ నుండి వచ్చిన విత్తనాల్లో నాసిరకం రావడానికి ఆస్కారం లేదని స్పష్టం చేశారు. రైతుల అనుమానాలను నివృత్తి చేసి 72 మంది నుంచి 310 బస్తాలను స్వాధీనం చేసి తాటిపుడిలోని రైతు సేవ ఆగ్రోస్ ద్వారా మళ్లీ విత్తనాలు ఇప్పించారు.



వైరాలోని సొసైటీ గోదాం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు



గ్రామంలో రైతుల వద్ద విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ పవన్‌కుమార్

మృతుని కుటుంబానికి రూ.20 లక్షల బీమా చెక్కు

సత్తుపల్లిటౌన్: బ్యాంకు ఖాతా కలిగి ఉండి ప్రమాదవశాత్తు మరణించిన వ్యక్తి కుటుంబానికి ఎస్‌బీఐ అధికారులు మంగళవారం రూ.20 లక్షల బీమా చెక్కు అందజేశారు. మండలంలోని రేజర్లకు చెందిన కొమ్మినపల్లి శివకృష్ణకు సత్తుపల్లి ఎస్‌బీఐలో ఖాతా ఉండడమే కాక బీమా రూ.వెయ్యి చెల్లించి బీమా చేయించుకున్నాడు. ఈమేరకు ఆయన గతేడాది నవంబర్ 26న షాక్‌తో మృతి చెందగా రూ.20 లక్షల బీమా చెక్కును ఎస్‌బీఐ ఖమ్మం రీజనల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి అందజేసి మాట్లాడారు. బ్యాంకు ద్వారా హెల్త్‌పాలసీ కూడా అందుబాటులో ఉందని, ఏటా రూ.1,300 చెల్లిస్తే వివిధ వ్యాధులకు చికిత్స కోసం రూ.లక్ష వరకు వస్తాయని తెలిపారు. బ్యాంక్ మేనేజర్ యు.బాలసుబ్రమణ్యం, ఉద్యోగులు, శివకృష్ణ కుటుంబీకులు కృష్ణయ్య, పావని, ధనలక్ష్మి, శివకుమారి, కంభంపాటి రాంబాబు, కాసర్ల రాంబాబు, సత్యనారాయణ, సర్వేశ్వరరావు, విజయ్, అంజిబాబు పాల్గొన్నారు.



బీమాచెక్కు అందజేస్తున్న ఎస్‌బీఐ ఆర్ఎం శ్రవణ్‌కుమార్‌రెడ్డి

రామచంద్రాపురంలో ఇరువర్గాల ఘర్షణ

పెనుబల్లి : పెనుబల్లి మండలం రామచంద్రాపురంలో పొలానికి వెళ్లే దారి విషయమై ఇద్దరు రైతుల మధ్య గొడవతో పలువురు రెండు వర్గాలుగా చీలిపోయి ఘర్షణకు దిగారు. ఇద్దరు రైతుల గొడవ పెద్దదై జరిగిన ఘర్షణలో షేక్ రియాజ్, వజ్రాల కేశవరెడ్డి, తాటి వెంకటేశ్వర్లు తదితరులకు గాయాలయ్యాయి. దీంతో సీఐ సీహెచ్.హనూక్, ఎస్సై సూరజ్ చేరుకుని వివరాలు సేకరించారు. కాగా, ఘటనపై ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నాయి.

పైనంపల్లిలో...

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లిలో పొలానికి వెళ్లే దారి విషయమై ఘర్షణ చోటు చోటుచేసుకుంది. ఏళ్లుగా పంచాయితీ నడుస్తుండగా మంగళవారం దారి నిర్మాణం చేపట్టారు. దీంతో రైతు వెంకట్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో వెళ్లి అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈమేరకు వెంకటరెడ్డి కుటుంబ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆతర్వాత ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, కూసుమంచి సీఐ జితేందర్, ఎస్సై జి.స్రవంతి, తహసీల్దార్ దారా ప్రసాద్ చేరుకుని వివరాలు సేకరించారు. కాగా, పైనంపల్లి గ్రామ రెవెన్యూ సహాయకులు నారాయణ ఆ స్థలం ప్రభుత్వ భూమేనని, చెరువు కట్ట అభివృద్ధి కోసం బాగు చేస్తుండగా వెంకటరెడ్డి అడ్డుకున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహారాష్ట్ర జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు



మహిళా టీ-20 విజేత మహారాష్ట్ర

రన్నరప్‌గా నిలిచిన ఉత్తరాఖండ్ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: ఆల్ ఇండియా మహిళా టీ–20 క్రికెట్ పోటీల్లో మహారాష్ట్ర జట్టు ట్రోఫీ కైవసం చేసుకుంది. అలాగే, ఉత్తరాఖండ్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. పోటీల్లో చివరి రోజైన మంగళవారం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన ఫైనల్స్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఉత్తరాఖండ్ జట్టు నిర్ణీత ఓవర్లలో 19.5 ఓవర్లు ఆడి పది వికెట్లు కోల్పోగా 87 పరుగులు చేసింది. జట్టులో సాక్షి వెహగ్ 26, గోల్డి 24, నందిని సింగ్ 17 పరుగులు చేశారు. మహారాష్ట్ర జట్టులో రీతూ భోస్లే, కిరణ్ ప్రభునరిగే మూడేసి వికెట్లు, చాన్‌మియా, శ్వేత పవార్, ప్రసిద్ధి ఒక్కో వికెట్ తీసుకున్నారు. అనంతరం 88 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన మహారాష్ట్ర జట్టు 18.1 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది,. జట్టులో అనిషా బిక్కాడ్ నాలుగు ఫోర్లతో 41, రితే బోస్లే 13 పరుగులు చేయగా, ఉత్తరాఖండ్ బౌలర్లలో రిషిక, హేమాపటేల్ ఒక్కో వికెట్ తీసుకున్నారు. అనంతరం విజేత జట్టుతో పాటు రన్నరప్ జట్లకు మహిళా క్రికెట్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో టోర్నీ డైరెక్టర్ సందీప్‌ఆర్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.డీ.మతిన్‌తో పాటు అజీం, డాక్టర్ ప్రీతి, దేవేందర్ శుక్లా, ఓలేటి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. తప్పిన ప్రమాదం

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై కూసుమంచి మండలంలోని అగ్రహారం క్రాస్‌రోడ్డు సమీపాన మంగళవారం ఓ కారు బోల్తా కొట్టింది. హైదరాబాద్ నుండి ఖమ్మం వైపు వస్తున్న కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి రహదారి పక్కన బోల్తా పడింది. ఈఘటనలో కారులోని ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.



రహదారి పక్కన బోల్తా పడిన కారు

వ్యక్తిపై దాడి, గాయాలు

చింతకాని: మండలంలోని మత్కేపల్లిలో వేల్పుల నాగుల్‌మీరాపై దాడి చేసి గాయపరిచిన ఘటనలో అదే గ్రామానికి చెందిన నంద్రు రవి, కుమారి, కీర్తి, సోమపొంగు మహాలక్ష్మి మంగళవారం కేసు నమోదైంది. గత నెల 26న రాత్రి నాగుల్‌మీరా ఇంటికి వెళ్తూ మార్గమధ్యలో జిల్లపల్లి రాజేష్‌తో మాట్లాడుతుండగా రవి చేరుకుని అసభ్య పదజాలంతో దూషిస్తూ ఇనుప రాడ్‌తో కొట్టేందుకు ప్రయత్నించాడు. దీంతో అడ్డుకోగా చేతికి తీవ్రగాయమైంది. ఈమేరకు చికిత్స చేయించుకున్న ఆయన రవితో పాటు ఆయన తల్లి కుమారి, భార్య కీర్తి, అక్క మహాలక్ష్మి తనను దూషించి దాడి చేశారని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్సై పాదిల వెంకన్న తెలిపారు.

రైలుకింద పడి ఆత్మహత్య

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ సమీపాన గుర్తు తెలియని వ్యక్తి (35) సోమవారం రాత్రి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు కథనం ప్రకారం.. మృతుడు ఎరుపు గళ్ల చొక్కా, బ్లూ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని మంగళవారం ఉదయం గుర్తించగా, అన్నం సేవా ఫౌండేషన్ సభ్యుల సహకారంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఉరి వేసుకుని యువకుడు...

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని సిద్ధారెడ్డి బజార్‌కు చెందిన దేవరకొండ మహేష్(30) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కూలీ పనులకు వెళ్లిన జీవనం సాగించే ఆయన ఇంట్లోనే మంగళవారం ఉరి వేసుకున్నాడు. మహేష్‌కు ఒక కుమార్తెతో పాటు, గర్భిణి అయిన భార్య ఉన్నారు. అయితే, ఆయన ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

కారులో చెలరేగిన మంటలు

సత్తుపల్లిటౌన్: రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన కారులో నుంచి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. కొత్తగూడెంనకు చెందిన ఎగ్గి రాజు సత్తుపల్లి వేంసూరు రోడ్డులోని ఓ హోటల్‌లో భోజనం చేసేందుకు కారును రోడ్డు పక్కన పార్క్ చేశాడు. కాసేపటికే కారులో నుంచి మంటలు, పొగ వస్తుండటంతో స్థానికులు గమనించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అయినా అదుపు కాకపోవడంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పారు. ఇంజన్ భాగం పూర్తిగా కాలిపోవడంతో రూ.2.90 లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని యజమాని తెలిపాడు.



కారు బానెట్ తెరుస్తున్న స్థానికులు

తెలంగాణ వర్సిటీలో విజి'లెన్స్'

- అధికారుల విస్తృత తనిఖీలు
- తెలంగాణ వర్సిటీ వీసీ పీఏ నుంచి ఫైళ్ల స్వాధీనం
- సోదాలు జరుగుతుండగా ఫైళ్లతో కారులో వెళ్లిన వీసీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ /భిక్కనూరు (కామారెడ్డి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో వైస్ చాన్స్లర్ రవీందర్ గుప్తా, ప్రొఫెసర్ కనకయ్య హయాంలో జరిగిన అక్రమ నియామకాలు, నిధుల దుర్వినియోగం, విచ్చలవిడి కొనుగోళ్లు తదితరాల నేపథ్యంలో మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం తనిఖీలు చేపట్టింది. రామచంద్రాపురం యూనిట్ (ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల పర్యవేక్షణ)కు చెందిన అదనపు ఎస్పీ ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 10 మంది సభ్యులు బృందాలుగా విడిపోయి వర్సిటీలోని ఎస్టేట్ విభాగం, ఎస్టాబ్లిష్మెంట్ విభాగం, అకౌంట్స్, ఇంజనీరింగ్, ఎగ్జామినేషన్ బ్రాంచ్, రిజిస్ట్రార్ ఆఫీస్, పర్చేజ్ కమిటీ, సర్వర్ రూమ్లలో విస్తృత సోదాలు చేశారు. వీటికి సంబంధించిన రికార్డులు, సీపీయూలు స్వాధీనం చేసుకున్నారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఈ సోదాలు చేశారు. బుధవారం సైతం ఈ సోదాలు ఉండనున్నట్లు తెలుస్తోంది.

వీసీ వెంటపడి వెళ్లిన విజిలెన్స్ అధికారులు

ఇదిలా ఉండగా అధికారులు తనిఖీలు ప్రారంభించిన 30 నిమిషాల తరువాత వర్సిటీలో తన చాంబర్లో ఉన్న వీసీ రవీందర్గుప్తా తన పీఏ ద్వారా కొన్ని ఫైల్స్ తెప్పించుకుని కారులో పెట్టుకుని హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. దీంతో ఒక బృందం వీసీ కారును వెంబడించి కామారెడ్డి జిల్లా భిక్కనూరు టోల్ప్లాజా వద్ద పట్టుకున్నారు. వాహనంలో ఉన్న వీసీ వద్దకు విజిలెన్స్ అధికారులు వెళ్లగా తన వాహనాన్ని ఎందుకు నిలిపారని, తనను ప్రశ్నించే అధికారం మీకు ఉందా అని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీంతో విజిలెన్స్ అధికారులు వీసీ పీఏ సవితతో



ఫైళ్లు తీసుకెళ్తున్న అధికారులు

మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

టోల్ప్లాజా వద్ద విచారణ 'సీన్'

టోల్ప్లాజా కార్యాలయం గదిలో గంటకు పైగా ఆమె వద్ద ఉన్న ఫైళ్లను పరిశీలించారు. కొన్ని ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సవిత వద్ద ఫైళ్లను పరిశీలించినంత సేపూ వీసీ రవీందర్ గుప్తా తన వాహనంలోనే కూర్చున్నారు. అనంతరం హైదరాబాద్ వెళ్లిపోయారు.

బ్యాంకు స్టేట్మెంట్లను పరిశీలిస్తాం

విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అదనపు ఎస్పీ ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ రికార్డులు స్వాధీనం చేసుకున్నామని, బ్యాంకు స్టేట్మెంట్ల కూడా పరిశీలిస్తామని చెప్పారు

పూర్తి కాని కొనుగోళ్లు.. ఆందోళనలో రైతన్నలు

- ఏడువేల కొనుగోలు కేంద్రాల్లో మూడువేలు మూసివేత
- ఇంకా చాలా జిల్లాల్లో చివరి దశలో కొనుగోళ్లు
- 57 లక్షల ఎంటీల ధాన్యం సేకరణ.. మరో 4.55 లక్షల ఎంటీల సేకరణ లక్ష్యం
- సమీపిస్తున్న రుతుపవనాలు, మొదలైన ఏరువాక

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రభుత్వం తలపెట్టిన ధాన్యం కొనుగోళ్లు ఇంకా పూర్తి కాకపోవడం రైతులను కలవరపెడుతోంది. చాలా జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఇంకా అమ్ముడుకాకపోవ డంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. ఓవైపు రుతుపవనాలు సమీపిస్తుండటం, రబీ సీజన్ మొదలవుతుండటం.. ఇంకోవైపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఇంకా అమ్ముడుపోకపోవడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు.. మిల్లర్లు కుమ్మక్కై చాలాచోట్ల క్వింటాలుకు 9 నుంచి 11 కిలోల వరకు కోత పెడుతున్నారు. అయినా సరే రైతులు కోతలకు సమ్మతించినా.. మిల్లర్లు చాలాచోట్ల కొర్రీలు పెడుతుండటం, ధాన్యాన్ని మిల్లుల్లో దింపకుండా అలాగే ఉంచడంతో లారీలు కొనుగోలు కేంద్రాలకు సరిగా వెళ్లడం లేదు. దీంతో కొనుగోళ్లలో తీవ్ర జాప్యం నెలకొంటోంది.

మరో 4.55 లక్షల మెట్రిక్ టన్నుల దూరంలో..


ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 62.16 లక్షల మెట్రిక్ టన్నుల (ఎంటీలు) ధాన్యం సేకరించాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 7,192 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. జూన్ 6 నాటికి అందులో 3,181 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తయింది. కానీ, మధ్యలో మిల్లర్ల కొర్రీలు, అకాల వర్షాలు, లారీల కొరత తదితర కారణాల వల్ల ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకు 57.61 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, మరో 4.55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన ధాన్యం విలువ రూ.11,843 కోట్లుగా ఉంది.



ప్రభుత్వ లక్ష్యం నెరవేరేనా?

ఏరువాక ఉత్సవాలతో రబీ సీజన్ మొదలైంది. ఈసారి రబీని నవంబరు నాటికి పూర్తి చేసి, యాసంగి పంట కోతలను మార్చి నాటికి ముగించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈసారి వేసవిలో అకాల వర్షాలు రైతులకు గత వందేళ్లలో ఏనాడూ చూడని నష్టాన్ని కలగజేశాయి. దీనికి తోడు వేసవిలో కోతలు ఏప్రిల్ వరకు సాగితే, వరి నుంచి మర ఆడిస్తే నూక అధికంగా వస్తుంది. ఈ సమస్యలను అధిగమించి మార్చి నాటికి కోతలను ముగిస్తే.. రైతుకు ప్రకృతి విపత్తులు, నూకల బెడద తప్పుతుందన్నది ప్రభుత్వ వ్యూహం. కానీ, కొనుగోళ్ల ప్రక్రియ జాప్యమవడంతో రబీ, యాసంగి సీజన్ల పంట ఆలస్యమయ్యే ప్రమాదముందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మూడు రోజుల్లో పూర్తి



మరో మూడు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తాం. ఎక్కడా రైతులకు ఇబ్బంది రానీయం. 95% ధాన్యం కొనుగోలు చేశాం. త్వరలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు కూడా జమవుతాయి.

–మంత్రి గంగుల కమలాకర్

కొనుగోళ్ల వేగం పెంచాం



రాష్ట్రంలో కొనుగోళ్ల ప్రక్రియ వేగం పుంజుకుంది. మంగళవారం ఒక్కరోజే 1,31,703 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడమే ఇందుకు నిదర్శనం. అకాల వర్షాలు, సాంకేతిక సమస్యల కారణంగా కొంచెం జాప్యమైన మాట వాస్తవమే. రెండు మూడు రోజుల్లో మిగిలిన 4.55 లక్షల మెట్రిక్ టన్నులు సైతం కొనేస్తాం.

–సర్దార్ రవీందర్ సింగ్, పౌరసరఫరాల శాఖ, చైర్మన్

కాంటా వేసి పదిహేను రోజులు



కొనుగోలు కేంద్రంలో 400 బస్తాలు కాంటా వేసి, 15 రోజులైతంది. లారీలు రాకపోవడంతో, బస్తాలు కొనుగోలు కేంద్రంలోనే ఉన్నాయి. వానలు పడుతుండటంతో తడుస్తయేమో అని భయంగా ఉంది. బస్తాలు తడవకుండా కవర్లు కప్పి ఉంచిన. ఇక్కడే కాపలా ఉంటున్న. లారీలు పంపి బస్తాలను మిల్లులకు తీసుకుపోవాలి. – కొట్టె అంజన్న, తాళ్లపేట, దండేపల్లి, మంచిర్యాల

నెలరోజులు గడుస్తున్నా..



గాధిర్యాల్ కేంద్రంలో ధాన్యం సేకరణ ఆలస్యంగా జరుగుతోంది. ధాన్యాన్ని కేంద్రానికి తెచ్చి నెల రోజులు దాటినా తూకం వేయలేదు. దీంతో నిత్యం వానలతో అవస్థలు పడుతున్నాం. రోజుకింత తడిసినప్పుడల్లా ధాన్యం మొలకెత్తుతోంది. 400 బస్తాల వరకు ధాన్యం ఉంది. ఇప్పటికైనా త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలి. –కుర్వ భీరతయ్య, రైతు గాధిర్యాల్, మహబూబ్నగర్

రెండో విడత పంట నష్టపరిహారానికి
రూ. 230 కోట్లు

- 2.30 లక్షల ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం
- ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ తుది నివేదిక
- త్వరలో రైతుల ఖాతాలో జమ చేసేందుకు ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: గత ఏప్రిల్ నెలలో రెండో విడత వడగళ్లు, భారీ వర్షాలకు జరిగిన పంట నష్టానికి రైతులకు రూ. 230 కోట్లు పరిహారంగా ఇవ్వాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. వివిధ జిల్లాల్లో 2.30 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని నిర్ధారించి, ప్రభుత్వానికి వ్యవసాయశాఖ తుది నివేదిక ఇచ్చింది. నిధులను త్వరలో విడుదల చేసి రైతులకు అందజేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు వ్యవసాయ వర్గాలు వెల్లడించాయి.

మొదటి విడతలో రూ. 151 కోట్లు..

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో రెండుసార్లు వడగళ్లు, భారీ వర్షాలకు లక్షలాది ఎకరాల్లోని యాసంగి సీజన్ పంటకు నష్టం జరిగిన సంగతి తెలిసిందే. వరి, మొక్కజొన్న, మామిడి తదితర పంటలకు తీవ్రమైన నష్టం వాటిల్లింది. మార్చి నెలలో కురిసిన వడగళ్లు, వర్షాలకు 1.51 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రభుత్వం నిర్ధారించింది. నష్టం జరిగిన ప్రాంతాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయానా పర్యటించి, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ప్రకటించిన విషయం విదితమే. ఆ మేరకు ప్రభుత్వం రూ. 151 కోట్లు పరిహారం మంజూరు చేసింది. ఆ పరిహారం రైతుల ఖాతాల్లో ఇంకా పూర్తిస్థాయిలో పడలేదని, ప్రక్రియ కొనసాగుతుందని వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడించాయి.

ఒక విపత్తు నష్టానికే..: ఈ ఏడాది విపత్తు కారణంగా రెండుసార్లు పంటలకు నష్టం వాటిల్లింది. రెండు విడతల్లో పంట నష్టం జరిగిన రైతులకు ఒక్కదానికి మాత్రమే పరిహారం ఇవ్వాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. నష్టపోయిన ప్రతి రైతు ఒకే వ్యవసాయ సీజన్లో ఒక విపత్తుకు మాత్రమే ఇన్పుట్ సబ్సిడీకి అర్హులని స్పష్టం చేసింది. అంటే మొదటి విడత ఒక రైతుకు ఒక ఎకరాలో పంట నష్టం జరిగి పరిహారం ప్రకటిస్తే, అదే రైతుకు ఏప్రిల్లోని విపత్తుకు మరో ఎకరాలో నష్టం జరిగితే దాన్ని పరిగణలోకి తీసుకోరు. ఒక రైతుకు వేర్వేరు చోట్ల ఉన్న వ్యవసాయ పంటలకు పూర్తి నష్టం జరిగితే ఒకదాన్నే ఎలా గుర్తిస్తారన్న విమర్శలున్నాయి. దీనిపై నిర్ణయం తీసుకోవడంలో వ్యవసాయశాఖ విఫలమైందన్న చర్చా జరుగుతోంది. కాగా, ఇన్పుట్ సబ్సిడీ చెల్లింపు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని వ్యవసాయశాఖ పేర్కొంది. వీటిని వీలైనంత వరకు ఆధార్తో అనుసంధానం చేయాలని ఆదేశించింది.

అడ్వాన్స్డ్లో 'వాట్సాప్ కాపీయింగ్'

▶ మొదటి పేజీ తరువాయి

ఎల్బీనగర్లోని కళాశాలల్లో సెంటర్లు పడ్డాయి. అయితే తన సోదరుడితో పాటు స్నేహితులకు కూడా మంచి మార్కులు రప్పించాలని భావించిన కడప విద్యార్థి ఐదుగురితో ఓ వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశాడు. కళాశాలల్లో తనిఖీ చేసే సిబ్బంది కళ్లుగప్పిన ఈ ఐదుగురూ పరీక్ష కేంద్రాల్లోకి తమ స్మార్ట్ఫోన్లు తీసుకువెళ్లారు.

కంప్యూటర్ స్క్రీన్ ఫొటోలు తీసి..

ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన ఈ పరీక్షను అభ్యర్థులు ఆన్లైన్లో రాయాల్సి ఉంటుంది. కంప్యూటర్లో ఒక ప్రశ్న తర్వాత మరో ప్రశ్న ప్రత్యక్షమవుతూ ఉంటే.. విద్యార్థులు జవాబులు టిక్ చేస్తూ పోతుంటారు. కడప విద్యార్థి కంప్యూటర్ స్క్రీన్పై తాను టిక్ చేసిన ప్రతి జవాబును ప్రశ్నతో సహా కనిపించేలా స్మార్ట్ఫోన్లో ఫొటోలు తీసి, వాట్సాప్ గ్రూప్లో పోస్టు చేయడం ద్వారా మిగిలిన నలుగురికీ చేరేలా చేశాడు. ఎస్వీఐటీ కాలేజీలో పరీక్ష హాలు పెద్దదిగా ఉండటం, ఇన్విజిలేటర్ విధుల్లో ఉన్న సిబ్బంది ఒకేచోట కూర్చుండిపోవడంతో గంటన్నర పాటు ఈ తతంగాన్ని ఎవరూ గుర్తించలేదు. 10.30 గంటల సమయంలో మల్లాపూర్ కేంద్రంలో ఇన్విజిలేటర్ అక్కడి విద్యార్థి వద్ద స్మార్ట్ఫోన్ ఉండటాన్ని గమనించారు. అందులో ఉన్న వాట్సాప్ గ్రూపులో కంప్యూటర్ స్క్రీన్ ఫొటోలను చూసిన ఆయన సదరు విద్యార్థిని ప్రశ్నించగా విషయం వెలుగులోకి వచ్చింది. ఎస్వీఐటీ కాలేజీ పరీక్ష కేంద్రంలోని కడప విద్యార్థి నుంచి ఈ ఫొటోలు వస్తున్నట్లు తెలుసుకుని ఆ సెంటర్ అధికారికి సమాచారమిచ్చారు. ఆయన కేంద్రంలోకి వెళ్లి కడప విద్యార్థిని తనిఖీ చేయగా అతడి వద్ద స్మార్ట్ఫోన్ లభించింది. ఇదే క్రమంలో మౌలాలి, ఎల్బీనగర్లోని కేంద్రాల్లో పరీక్ష రాస్తున్న మరో ముగ్గురినీ పట్టుకున్నారు. ఈ ఐదుగురూ ఐఐటీ–హైదరాబాద్ తరఫున జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్షలు నిర్వహిస్తున్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఐఓఎన్ సంస్థకు క్షమాపణ పత్రాలు రాసి ఇచ్చారు. సంస్థ సిబ్బంది ఆదివారం రాత్రి మార్కెట్, మల్కాజ్గిరి, ఎల్బీనగర్, నాచారం పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేయగా మంగళవారం వెలుగులోకి వచ్చింది.

నిర్వహణ సంస్థ నిర్లక్ష్యం?

విద్యార్థులపై పోలీసులు ఐపీసీ 188, 420తో పాటు తెలంగాణ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్లోని 4 (బీ), 8 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఐదుగురి ఫోన్లనూ స్వాధీనం చేసుకున్నారు. ఈ పరీక్ష నిర్వహిస్తున్న ప్రైవేట్ సంస్థ నిర్లక్ష్యంతోనే స్మార్ట్ ఫోన్లు పరీక్ష కేంద్రంలోకి వెళ్లాయని చెప్తున్నారు. నాలుగు పరీక్ష కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న ఇన్విజిలేటర్లు, అబ్జర్వర్లకూ నోటీసులు ఇచ్చి విచారించడంతో పాటు వాంగ్మూలం నమోదు చేయాలని భావిస్తున్నారు.

బీఆర్ఎస్.. విద్యుత్ ఉత్పత్తి పెంచలేదు

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని బీజేపీ నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి విమర్శించారు. సీఎం కేసీఆర్ ఇస్తున్నది ఉచిత విద్యుత్ కాదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఏడాదికి ఒక హార్స్పవర్కి రూ.20 చార్జ్ (ఏడు గంటల కరెంట్ సరఫరాకు) చేశారని, కేసీఆర్ మాత్రం సర్చార్జ్ పేరుతో ఒక హెచ్పీకి రూ.20 వసూలుతో పాటు, ఇంటికి వాడే కరెంటుకూ సర్చార్జీలను వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు 24గంటల కరెంట్ ఇవ్వడం లేదన్నారు. ఉచిత విద్యుత్కు డబ్బు ఎవరు ఇస్తున్నారు? ఎక్కడ నుంచి వస్తుందో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టుల నుంచి వస్తున్న విద్యుతే ఇప్పుడు సరఫరా చేస్తున్నారన్నారు. ఛత్తీస్గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు ఒప్పందం మేరకు డబ్బు ఇవ్వకపోవడంతో ఆ రాష్ట్రం తెలంగాణపై కేసు వేసిందని చెప్పారు.

జిల్లా వార్తలు

కిన్నెరసానిని సందర్శించిన ఒంగోలు జడ్జి



బోటు షికారు చేస్తున్న జడ్జి, కుటుంబసభ్యులు

పాల్వంచరూరల్ : పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని ఏపీలోని ఒంగోలు జిల్లా జడ్జి టి.రాజ వెంకటాద్రి కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం సందర్శించారు. డీర్ పార్క్లో దుప్పులను, డక్ పాండ్లో బాతులను, జలాశయాన్ని వీక్షించారు. అనంతరం రిజర్వాయర్లో బోటు షికారు చేశారు. ఆయన వెంట వైల్డ్లైఫ్ సిబ్బంది, పలువురు న్యాయవాదులు ఉన్నారు.

పామాయిల్ రైతుల సమస్యలపై వినతి



ఆయిల్ఫెడ్ ఎండీకి వినతిపత్రం ఇస్తున్న సంఘం బాధ్యులు

అశ్వారావుపేటరూరల్: ఆయిల్పామ్ సాగు చేస్తున్న రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ పామాయిల్ రైతు సంఘం ఆధ్వర్యాన ఆయిల్ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, ఎండీ సురేందర్రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో ఆయిల్ఫెడ్, ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యాన 95 వేల ఎకరాల్లో పంట సాగవుతుండగా, దాదాపు 25 వేల మంది రైతులు ఆధారపడ్డారని తెలిపారు. పంట సాగుపై దృష్టి సారిస్తున్నప్పటికీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం జరుగుతోందని చెప్పారు. మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ జారీ చేసిన జీఓను తెలంగాణ రైతులకు వర్తింపజేయొద్దని, పామాయిల్పై దిగుమతి సుంకం 15 శాతానికి పైగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, పామాయిల్ గెలల ధర తగ్గుదల ప్రభావం రైతులపై పడకుండా టన్ను ధర రూ.20 వేలకు తగ్గకుండా పర్యవేక్షించాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, అన్నవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగాన్ని పెంచేది ఆర్థిక విధానాలే

- యువతను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతున్న యూనివర్సిటీలు
- లాభాలు ఆర్జించటమే ధ్యేయంగా పెట్టుబడిదారీ వ్యవస్థ
- పీవైఎల్ రాష్ట్ర మహాసభల్లో సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

ఖమ్మంమయూరిసెంటర్: కళాశాలలు, యూనివర్సిటీల్లో విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతుండగా.. ప్రభుత్వాల విధానాలతో నిరుద్యోగం పెరుగుతోందని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఖమ్మంలో జరుగుతున్న పీవైఎల్ రాష్ట్ర రెండో మహాసభల్లో భాగంగా మంగళవారం భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సభలో లక్ష్మీనారాయణ ప్రారంభోపన్యాసం చేస్తూ దోపిడీదారులకు అనుకూలమైన విధానాలను రూపొందించడం ద్వారా శ్రమదోపిడీ, నిరుద్యోగం పెరుగుతున్నాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో వామపక్ష పార్టీలు చేసిన పోరాటం మరువలేనిదన్నారు. ఉద్యమ సమయంలో ఈ విషయాన్ని అంగీకరించిన సీఎం కేసీఆర్.. రాష్ట్రంలో 1.07 లక్షల ఉద్యోగాలు ఖాళీలున్నాయని చెప్పినా వాటి భర్తీకి చొరవ తీసుకోవడం లేదన్నారు. యూనివర్సిటీలు



పీవైఎల్ రాష్ట్ర మహాసభల్లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

నిరుద్యోగుల్ని తయారు చేస్తున్నాయనే ప్రచారంలో వాస్తవంలేదని స్పష్టం చేశారు. ఇక్కడ ఉన్న పరిశ్రమలను మూసివేయించి అమెరికా వెళ్లి పరిశ్రమలు తెస్తానని మంత్రులు చెప్పడం యువతను తప్పుదోవ పట్టించడమేనని తెలిపారు. కార్పొరేట్, మతతత్వ శక్తులు దేశాన్ని పాలిస్తుండగా.. యువతకు కావాల్సిన మేరకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడం లేదని లక్ష్మీనారాయణ తెలిపారు. విద్య, వైద్యం, నీళ్ల అమ్మకం ద్వారా ప్రజల డబ్బును కార్పొరేట్శక్తులు లాక్కుంటున్నాయని.. అదే ప్రజల మధ్య డబ్బు ఉంటే ఆర్థిక మాంద్యం మాటే ఉండదని పేర్కొన్నారు. న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోవర్ధన్ మాట్లాడగా అరుణోదయ కళాకారులు పాడిన గేయాలు ఆకట్టుకున్నాయి. పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబాబు మాట్లాడుతూ మహాసభలు విజయవంతానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు బాబూరావు, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు నాగమణితో పాటు వీరమోకాళ్ల రమేశ్కుమారి, రణధీర్, ఎం.గిరి, శోభారాణి, సురేశ్, హన్మంతరావు, నలగాటి వీరేందర్ తదితరులు మాట్లాడారు.

నారాయణపురంలో ఆధ్యాత్మిక శోభ



బోనాలతో బారులుదీరిన మహిళలు (ఇన్సెట్) హోమంలో పాల్గొన్న భక్తులు

బొడ్రాయి ప్రతిష్ఠాపన సందర్భంగా బోనాలు, హోమం

సత్తుపల్లి: మండలంలోని నారాయణపురం మంగళవారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్థానికంగా అభయాంజనేయస్వామి, ముత్యాలమ్మ తల్లి, బొడ్రాయి ప్రతిష్ఠాపన సందర్భంగా హోమం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో బొడ్రాయి నుంచి అభయాంజనేయస్వామి ఆలయం ప్రాంగణానికి తరలివచ్చారు. ఈ నెల 8న జరిగే ప్రతిష్ఠా మహోత్సవానికి ఎంపీలు బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ దేశిరెడ్డి రంగారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు మందపాటి వెంకటరెడ్డితో పాటు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బేతిని శ్రీనివాసరావు, గోగులమూడి బాలాజీరెడ్డి, మందపాటి కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తానా సభలకు ఆహ్వానం



రావూరి సైదబాబు

ఖమ్మంఅర్బన్: తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) 23వ సదస్సులో పాల్గొనాల్సిందిగా ఖమ్మానికి చెందిన రావూరి ఈవెంట్స్, ప్లానర్స్ చైర్మన్ రావూరి సైదబాబుకు ఆహ్వానం అందింది. వచ్చే 7 నుంచి అమెరికాలోని పెన్సిల్వేనియాలో ఈ సభలు జరగనున్నాయి. ఈ సందర్భంగా తానా అధ్యక్షుడు అంజయ్య చౌదరి, సదస్సు సమన్వయకర్త పొట్లూరి రవి ఆహ్వాన పత్రిక పంపారని అల్లీపురానికి చెందిన సైదుబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సింగరేణి యాజమాన్యంతో నేడు కార్మిక సంఘాల భేటీ

సూపర్బజార్(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం, సీఎంపీఎఫ్ అధికారులతో బుధవారం జాతీయ కార్మిక సంఘాల నాయకులు సమావేశం కానున్నారు. కాంట్రాక్టు, పర్మనెంట్ కార్మికుల పెన్షన్ సీఎంపీఎఫ్ సమస్యలపై గోదావరిఖని ఏరియా ఇల్లెందు క్లబ్లో ఈ సమావేశం జరగనుంది. పెన్షన్ సీఎంపీఎఫ్ సమస్యలతో పాటు ప్రస్తుతం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్న ఈ సమావేశంలో సీఎంపీఎఫ్ కమిషనర్తోపాటు సింగరేణి డైరెక్టర్లు, ఐదు జాతీయ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొననున్నారు.

22 కాంట్రాక్టులు ఒకరికే ఎలా ఇస్తారు?

మేం చెప్పే వరకు బిల్లులు చెల్లించొద్దు : హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆర్అండ్బీ, పంచాయతీరాజ్ శాఖలు ఒకే కాంట్రాక్టర్కు నామినేషన్ ప్రాతిపదికన 22 పనులు అప్పగించడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. కాంట్రాక్టులను అలా ఎలా అప్పగిస్తారని ప్రశ్నించింది. తాము ఉత్తర్వులు ఇచ్చేవరకు సదరు కాంట్రాక్టర్కు బిల్లులు చెల్లించొద్దని ఆదేశించింది. అంతేకాక పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన అధికారులు, ఎంఎస్ఆర్ కన్స్ట్రక్షన్స్కు నోటీసులు ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఒకరికే 22 కాంట్రాక్టులు అప్పగించిన అధికారుల నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఖమ్మం జిల్లాకు చెందిన రాంబాబు ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ పిటిషన్పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎస్.తుకారాంజీ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఆర్అండ్బీ, పంచాయతీరాజ్ అధికారులు అప్పగించిన పనుల్లో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండానే ఎంఎస్ఆర్ కన్స్ట్రక్షన్స్ పనులు నిర్వహిస్తోందని పిటిషనర్ పేర్కొన్నారు. పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు లేకుండా అటవీప్రాంతంలో రోడ్లు, వంతెనలు నిర్మిస్తోందన్నారు. అయితే, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని పరిశీలించాకే కాంట్రాక్టుల అప్పగింత జరిగిందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎ.సంజీవ్కుమార్ తెలిపారు. ఇరువర్గాల వాదనలను విన్న ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వచ్చేనెల 25వ తేదీకి వాయిదా వేసింది.

వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలి

ఆయిల్ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్రెడ్డి

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట: సంస్థ నిర్దేశించిన ఆయిల్ ఇయర్ లక్ష్యాన్ని చేరుకునేలా పనిచేయాలని ఆయిల్ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్రెడ్డి సూచించారు. అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం వద్ద పామాయిల్ నర్సరీలో మొక్కలు, బీ–బ్లాక్లో నిర్మిస్తున్న అతిథి భవన నిర్మాణ పనులతో పాటు దమ్మపేట మండలం అప్పారావుపేట వద్ద పామాయిల్ ఫ్యాక్టరీలో విస్తరణ పనులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీల్లో గెలల క్రషింగ్, గెలల నిల్వలపై ఆరా తీసిన ఆయన పామాయిల్ మొక్కల పంపిణీపై సూచనలు చేశారు. వర్షాలు మొదలుకాగానే మొక్కల పంపిణీ చేపట్టాలని తెలిపారు. కాగా, అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ సామర్థ్యాన్ని 60 టన్నుల నుంచి 90 టన్నుల సామర్థ్యానికి పెంచేలా విస్తరిస్తుండగా నూతన యంత్రాలు, బాయిలర్ను పరిశీలించిన సుధాకర్రెడ్డి సెప్టెంబర్ కల్లా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమాల్లో ప్లాంట్స్ అండ్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్రెడ్డి, ఫ్యాక్టరీ మేనేజర్లు ఆకుల బాలకృష్ణ, కల్యాణ్గౌడ్, వెంకటేశ్, నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



దమ్మపేట ఫ్యాక్టరీలో సూచనలిస్తున్న జీఎం సుధాకర్రెడ్డి

బెస్ట్ పోస్టల్ డివిజన్గా ఖమ్మంకు అవార్డు

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ తపాలా సర్కిల్ స్థాయిలో అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రగతి సాధించిన ఖమ్మం తపాలా డివిజన్కు బెస్ట్ పోస్టల్ డివిజన్ అవార్డు దక్కింది. దీంతో పాటు ఇతర విభాగాల్లో మరో మూడు అవార్డులు వచ్చాయి. హైదరాబాద్లో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఉద్యోగులకు చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె.ప్రకాష్, పోస్ట్మాస్టర్ జనరల్ పీవీఎస్.రెడ్డి, పోస్టుమాస్టర్ జనరల్ టీఎం.శ్రీలత అవార్డులు అందజేశారు. బెస్ట్ డివిజన్ అవార్డును పోస్టల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్, సర్కిల్ పరిధిలో స్పీడ్ పోస్టు బెస్ట్ మెయిల్ డెలివరీ అవార్డును ఖమ్మం హెడ్ పోస్టాఫీస్ పోస్ట్ మాస్టర్ కె కిరణ్కుమార్రెడ్డి, బ్రాంచ్ పోస్టాఫీసుల్లో అత్యధిక అకౌంట్లు తెరిపించిన కూసుమంచి మండలం జక్కేపల్లి పోస్ట్మాస్టర్ కె.సోమయ్య అవార్డులు అందుకోగా, జిల్లా ఉద్యోగులు అభినందించారు.





అవార్డు స్వీకరిస్తున్న సూపరింటెండెంట్ రవికుమార్, హెడ్ పోస్టాఫీస్ పోస్ట్మాస్టర్ కిరణ్కుమార్రెడ్డి